


రైలు టిక్కెట్ల రిజర్వేషన్ వేళల్లో మార్పు

బెలగాం, ఫిబ్రవరి 6: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పార్వతీపురం రైల్వే స్టేషన్ (బెలగాం)లో టిక్కెట్ల రిజర్వేషన్ సమయాల్లో మార్పు చేసినట్లు చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ వినేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు రిజర్వేషన్ సౌకర్యం ఉండేదని తెలిపారు. అయితే ఇకపై ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 1 నుంచి 1.30 గంటల వరకు భోజన విరామ సమయమని వెల్లడించారు.

బిల్లులిస్తేనే పనులు

- అధికారులకు తేల్చి చెప్పిన కాంట్రాక్టర్లు
- రూ.15 కోట్లకు పైగా బకాయిలు
- చెల్లింపుల్లో వైసీపీ సర్కారు అలసత్వం
- తోటపల్లి ఆధునికీకరణ పనులపై నీలినీడలు
- రానున్న ఖరీఫ్‌లో రైతులకు తప్పని ఇబ్బందులు



తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు

(గరుగుబిల్లి)

తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పాత రెగ్యులేటర్ పరిధిలోని ఆధునికీకరణ పనులపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. బిల్లుల చెల్లింపుల్లో వైసీపీ సర్కారు అలసత్వం ప్రదర్శిస్తుండడంతో కాంట్రాక్టర్లు వెనుకంజ వేస్తున్నారు. బిల్లులు వస్తాయో రావోనన్న దిగులులో ఉన్నారు. ఇప్పటికే అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, సకాలంలో చెల్లించకపోతే ఎలా? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటివరకు చేసిన పనులకు పూర్తిస్థాయిలో చెల్లిస్తేనే పనులు తిరిగి చేపడతామని వారు చెబుతున్నారు. దీంతో సంబంధిత అధికారుల్లో ఆందోళన నెలకొంది. గడువులోపు పనులు పూర్తికాకపోతే రానున్న ఖరీఫ్‌లో ఇబ్బందులు తప్పవని మరోవైపు రైతులు ఆవేదన చెందుతున్నారు. సర్కారు స్పందించి త్వరగా బిల్లులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలోని ఎడమ ప్రధాన, కుడి పిల్ల కాలువల అభివృద్ధికి గత తెలుగుదేశం ప్రభుత్వం సుమారు రూ. 190 కోట్లు మంజూరు చేసింది. దీంతో కొంతమేర పనులు జరిగాయి. అయితే ఆ తర్వాత ఎన్నికలు జరగడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో పరిస్థితి మారింది. ప్రభుత్వం చెల్లింపులు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనుల నిర్వహణకు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం రెండు కాలువల పరిధిలో సుమారు రూ. 40 కోట్లతో 30 శాతానికి పైగా పనులు జరిగాయి. గతంలో నిలిచిన పనులు ప్రారంభం కావాల్సి ఉన్నా సంబంధిత కాంట్రాక్టర్లకు సుమారు రూ. 15 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. అయితే రెండేళ్ల నుంచి ప్రభుత్వం చెల్లింపులకు తీవ్ర జాప్యం చేస్తుంది. దీంతో ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదు. ఎడమ ప్రధాన కాలువకు సంబంధించి 37.62 కిలో మీటర్లకు గాను 16 కిలో మీటర్లు, కుడి పిల్ల కాలువ 17.616 కిలో మీటర్లకు గాను 9.37 కిలో మీటర్ల మేర లైనింగ్, కాంక్రీటు పనులు నిర్వహించారు. ఎడమ కాలువ పరిధిలో 8, కుడి కాలువ పరిధిలో 11 బ్రాంచి కాలువల పనులు చేయాల్సి ఉంది. వీటితో పాటు సుమారు 267కు పైగా అక్విడెక్టులు, సూపర్‌పాసెజ్‌లు, అండర్ టన్నెళ్లు, డ్రాపులు, ఓటీ స్లూయిస్‌లు నిర్మించాల్సి ఉంది.

ఫిబ్రవరి వచ్చినా..

పాత రెగ్యులేటర్ పరిధిలోని కాలువల ఆధునికీకరణ పనులను ఏటా డిసెంబరులోనే ప్రారంభించేవారు. అయితే ప్రధానంగా చెల్లింపులు కాకపోవడంతో నిర్వహణలో జాప్యం నెలకొంది. ప్రస్తుతం ఫిబ్రవరి వచ్చినా.. ఇంకా పనుల ఊసే లేదు. మే నెలాఖరుకు పనులు పూర్తయితే జూన్ మొదటి వారంలో ఖరీఫ్‌కు సాగునీరు విడుదలకు సన్నాహాలు చేసేవారు. అయితే సమయం దగ్గరపడుతుండగా.. ఆ లోపు పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు. దీంతో ఖరీఫ్ రైతులకు ఈ ఏడాది కూడా కష్టాలు తప్పేలా లేవు. మరోవైపు రెండు కాలువల పరిధిలో అధికంగా గండ్లు పడ్డాయి. ఖరీఫ్‌లో గండ్లు పడినా యంత్రాంగం అంతంత మాత్రంగానే స్పందించింది. నిధుల సమస్యతో చేతులెత్తేశారు. దీంతో రైతులపైనే భారం పడుతుంది.

మూడుసార్లు గడువు పెంపు..

సంబంధిత పనుల నిర్వహణకు గాను కాంట్రాక్టర్లకు మూడుసార్లు గడువు పెంచారు. 2018లో చేపట్టిన పనులకు మొదట 18 నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఆలోపు పూర్తి చేయలేకపోయారు. రెండో దఫా 2023 మే 28 వరకు గడువు పెంచారు. ప్రస్తుతం మూడో దశకు సంబంధించి ఈ ఏడాది మే నెల 28 నాటికి అవకాశం ఇచ్చారు. అయితే ఇంకా మూడు నెలలే సమయం ఉండగా.. ఆలోపు పనులు పూర్తి చేసే అవకాశం లేదు. రెండు కాలువల పరిధిలో అధికారికంగా 65 వేలు, అనధికారికంగా మరో 30 వేలకు పైగా ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. లేకుంటే పంట పొలాలు బీడుగా మారే పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

ప్రభుత్వ వైఫల్యం..



ప్రభుత్వం వైఫల్యం రైతులకు శాపంలా మారింది. రెండు కాలువల పరిధిలోని రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. పంట అమ్మకానికి, సాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. తక్షణమే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి ఆధునికీకరణ పనులు ప్రారంభించాలి. లేకుంటే రైతు ఉద్యమం తప్పదు.

-ద్వారపురెడ్డి సత్యనారాయణ,
అరకు టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి, గరుగుబిల్లి

చెల్లింపులకు చర్యలు..



ఆధునికీకరణ పనులు నిర్వహించిన కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. పనుల పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదించాం. దీనిపై సంబంధిత కాంట్రాక్టర్లతో కూడా చర్చిస్తున్నాం. ఈ నెల రెండో వారం నుంచి పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం తోటపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టాయి. తాగునీటి అవసరాల నిమిత్తం కుడి పిల్ల కాలువల నుంచి చెరువులకు కొంతమేర సరఫరా చేస్తున్నాం. ఆరుతడి పంటల సాగు ప్రయత్నాలను రైతులు విరమించుకోవాలి. రానున్న ఖరీఫ్‌కు ఇబ్బందులు లేకుండా పనులు నిర్వహిస్తాం.

-డి.రవికుమార్, డీఈఈ, పాలకొండ డివిజన్



ప్రాజెక్టుకు ఆనుకుని ఉన్న ఎడమ ప్రధాన కాలువ పరిస్థితి ఇదీ..



తురకనాయుడువలస వద్ద శిథిలావస్థలో ఉన్న కల్వర్టు

పాహిమాం.. పోలమాంబ

- శంబర మూడో వారం జాతరకు పోటెత్తిన భక్తులు
- కిక్కిరిసిన క్యూలైన్లు
- ఎండ తీవ్రతకు విలవిల



రోడ్డు మీదకు క్యూలైన్లు రావడంతో ఎండలో ఇబ్బంది పడుతున్న భక్తులు

మక్కువ/సాలూరు రూరల్, ఫిబ్రవరి 6: శంబర పోలమాంబ మూడోవారం జాతరకు భక్తజనం పోటెత్తారు. మంగళవారం ఉదయం నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి రావడంతో గ్రామంలో వీధులన్నీ కిటకిటలాడాయి. చదురుగుడి వద్ద క్యూలైన్లన్నీ కిక్కిరిశాయి. రూ. 20, రూ. 50 క్యూలైన్లు గోముఖీ వంతెన వరకు వచ్చాయి. అయితే దేవదాయ శాఖాధికారులు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో ఎండ తీవ్రతకు భక్తులు విలవిల్లాడిపోయారు. మొత్తంగా క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షించిన తర్వాత పోల మాంబను దర్శించుకున్నారు. ఒడిశా, ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారు గోముఖీ నదీ తీరం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, చీరలతో మొక్కులు చెల్లించుకు న్నారు. అనంతరం శంబరలోనే వంటలు చేసుకొని కుటుం బాలతో విందు చేశారు. వనంగుడి వద్ద అమ్మవారు భూ ప్రవేశం చేసిన చెట్టు వద్ద భక్తులు పూజలు చేసి దీపారాధన చేశారు. మొత్తంగా తొలివారం జాతరను తలపించేలా సుదూర ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు రావడంతో శంబర గ్రామం భక్తజన సంద్రంగా మారింది. మరోవైపు పోలీసు భద్రతను 150 మంది నుంచి 120 మంది కుదించారు. దీంతో భక్తులను నియంత్రించ డానికి పోలీసులు తిప్పలు పడ్డారు. ఇక సాలూరు నుంచి 15 ఆర్టీసీ బస్సులను ప్రత్యేకంగా శంబరకు నడిపారు.



ప్రత్యేక అలంకరణలో పోలమాంబ

ప్రశాంత ఎన్నికలకు చర్యలు: కలెక్టర్

బెలగాం, ఫిబ్రవరి 6 : జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్యోగి చేసే పనిపై నిఘా ఉంటుందని, ఎన్నికల ప్రవర్తనా నియావళి, ప్రొటోకాల్ విధులపై అవగాహన ఉండాలని తెలిపారు. జిల్లాలో 1031 పోలింగ్ కేంద్రాలు, 154 సెక్టారులు ఉన్నాయని వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. రెవెన్యూ అంశాలపై అప్రమత్తంగా ఉండాలని, జాయింట్ కలెక్టర్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు మాత్రమే పట్టాలు, పాస్‌బుక్‌లు జారీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీ గోవిందరావు, సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏల పీవోలు కల్పనా కుమారి, విష్ణుచరణ్ ఉన్నారు.

కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి

జిల్లాలో కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కన్సల్టేటివ్ కమిటీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకర్లతో చర్చించారు. జిల్లాలో 12 వందల మంది కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలన్నారు. పీఎం సురక్ష బీమా యోజన పథకంలో అర్హులైన వారందర్నీ నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలో చేపట్టే ప్రాధాన్యత కార్య క్రమాల్లో బ్యాంకులు భాగస్వామ్యం కావాలని కోరారు. 2023-24 సంవత్సరానికి రుణ లక్ష్యం రూ.2,529 కోట్లు కాగా రూ.2,350 కోట్లు మంజూరు చేసి 93 శాతం లక్ష్యం సాధించారని తెలిపారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ జేఎల్ఎస్ మూర్తి, ఆర్బీఐ లీడ్ జిల్లా అధికారి నాగ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

డీఈవోగా పగడాలమ్మ

బెలగాం, ఫిబ్రవరి 6: సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో పలు జిల్లాల్లో డీఈవోలను బదిలీ చేశారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిలో భాగంగా జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో)గా జి.పగడాలమ్మను నియమించారు. ఇప్పటివరకు మన్యం జిల్లా డీఈవోగా పనిచేసిన ఎన్.ప్రేమ్‌కుమార్‌ను విజయనగరం జిల్లా విద్యాశాఖాధికారిగా బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

డీ వార్మింగ్ డేకు సర్వం సిద్ధం : డీఎంహెచ్‌వో

పార్వతీపురం రూరల్, ఫిబ్రవరి 6 : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో 1,75,891 మంది చిన్నారులు, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడానికి కార్యాచరణ సిద్ధం చేశామని డీఎంహెచ్‌వో బి.జగన్నాథరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9న అన్ని విద్యా సంస్థల్లో డీవార్మింగ్ డే నిర్వహిస్తారని, 16న మాప్ అప్ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో 84,426 మంది బాలురు, 88,465 మంది బాలికలు ఉన్నారని ఆయన తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఆరేళ్ల పైబడి విద్యార్థులకు పాఠశాలలు, కళాశాలల్లో మాత్రలు అందిస్తామన్నారు. రెండేళ్ల లోపు చిన్నారులకు అరమాత్ర గుండగా చేసి వేయించాలని, 19 సంవత్సరాల విద్యార్థులు ఒక మాత్ర బాగా నమిలి మింగేటట్టు చూడాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు.



త్రుటిలో తప్పింది..

పార్వతీపురం నుంచి గమ్మలక్ష్మీపురం వెళ్తున్న ఓ వ్యాను గుమ్మగదబవలస గ్రామ సమీపంలో మంగళవారం అదుపు తప్పింది. రక్షణ గోడలు లేని వంతెన అంచుకు చేరుకుని లోయవైపు దూసుకుపోయింది. అయితే అదృష్టవశాత్తూ వ్యాను లోయలో పడకపోవడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. వంతెన మలుపులో ఉండడం, దానికి రక్షణ గోడలు లేకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. అయితే ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. **- కురుపాం రూరల్**




నిధులు కేటాయిస్తారా?

- నేడు ఓటాన్ అకౌంట్ బడ్జెట్
- అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న వైసీపీ ప్రభుత్వం
- కొత్త జిల్లాకు ప్రాధాన్యం కల్పిస్తారా!
- సాగునీటి ప్రాజెక్టులు, వంతెనల నిర్మాణాలు పూర్తి చేస్తారో.. లేదో!
- ఎన్నికల వేళ.. సర్వత్రా ఇదే చర్చ

పార్వతీపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):

వైసీపీ ప్రభుత్వం 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బుధవారం అసెంబ్లీలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను సమర్పించబోతోంది. అయితే ఇందులో జిల్లాకు ఏ మేరకు నిధులు కేటాయిస్తారన్నది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. ఎన్నికల సమయం కావడంతో ఈ బడ్జెట్‌లో కొత్త జిల్లాకు ఏ మేరకు ప్రాధాన్యం కల్పిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. వాస్తవంగా నాలుగున్నరేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం జిల్లాలో చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు చేపట్టింది లేదు. సాగునీటి ప్రాజెక్టులు, వంతెనల నిర్మాణాలకు కూడా పెద్దగా నిధులు కేటాయించలేదు. బిల్లులు సకాలంలో చెల్లించడం లేదు. దీంతో ఆయా పనులు నేటికీ నత్తనడకనే సాగుతున్నాయి. అయితే కొద్ది నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం జిల్లాకు ఏ స్థాయిలో నిధులు కేటాయిస్తుందో వేచి చూడాల్సి ఉంది. కాగా 'మన్యం'లో సాగునీటి ప్రాజెక్టులు, వంతెనల నిర్మాణాలకు ఎంతెంత నిధులు అవసరమో ఇప్పుడు తెలుసుకుందాం.



జంఝావతి ప్రాజెక్టు

తోటపల్లికి రూ.335 కోట్లు అవసరం

పార్వతీపురం మన్యం , విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే తోటపల్లి ప్రాజెక్టు పనులు పూర్తికావాలంటే ఇంకా రూ.335 కోట్లు అవసరం. ప్రాజెక్టు వద్ద ట్రిక్రేన్, గేట్స్ స్పిల్‌వే ఇద్ద ఇరువైపులా ఫ్లడ్ బ్యాంక్స్ తదితర పనులు పూర్తికావాలంటే రూ.210 కోట్లు ఉండాలి. భూసేకరణ కోసం రూ. ఐదు కోట్లు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి రూ. 120 కోట్లు మంజూరు చేయాల్సి ఉంది.

జంఝావతి పరిస్థితి ఇదీ..

జంఝావతి ప్రాజెక్టు ద్వారా 24 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది కలగానే మారింది. వైసీపీ ప్రభుత్వం పాలన పగ్గాలు చేపట్టిన తర్వాత ఈ ప్రాజెక్టుపై పూర్తిగా దృష్టి సారించలేదు. దీంతో పనులేవీ పూర్తికాలేదు. ప్రాజెక్టు , కాలువల నిర్వహణకు సుమారు రూ. 85 లక్షలు అవసరం. ప్రస్తుతం జరిగిన పనులకు సంబంధించి రూ. కోటి నాలుగు లక్షలకు, వచ్చే ఏడాదిలో చేపట్టబోయే పనుల కోసం రూ.కోటి 64 లక్షల 45 వేల మంజూరుకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. కానీ ఇంతవరకు వాటికి వైసీపీ సర్కారు ఆమోదం తెలపలేదు. వాస్తవంగా ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలంటే కోట్లాది రూపాయలు అవసరం. కానీ వాటిని ప్రస్తావించకుండానే మార్చి నెలలోపు చెల్లించాల్సిన బిల్లులకు, వచ్చే ఏడాది చేపట్టబోయే పనులకు, ఇప్పటివరకు చేపట్టిన నిర్మాణాలకు అవసరమైన నిధులు కోసం అధికారులు ప్రతిపాదనలు పంపించారు. హైలెవెల్ కెనాల్ తదితర పనులు పూర్తికి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లినప్పటికీ.. ఇంతవరకు నిధులు మంజూరు కాలేదు.

వంతెనలు ఇలా..

- కొమరాడ మండలంలో నాగావళి నదిపై పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణానికి కూడా మోక్షం కలగడం లేదు. మరో 20 శాతం నిర్మాణమే మిగిలి ఉండగా.. దానిపై వైసీపీ సర్కారు శ్రద్ధ వహించడం లేదు. వంతెన నిర్మాణం పూర్తికి సుమారు రూ.5 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపినా ఇప్పటికీ ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదు. దీంతో ఈ వంతెన నిర్మాణం తుది దశకు చేరుకోవడం లేదు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవంతో ఇప్పటికే కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. ఈ వంతెన పూర్తయితే మూడు మండలాలకు చెందిన సుమారు 30 గ్రామాల ప్రజల కష్టాలు తీరుతాయి. అయినా సర్కారు దీనిపై దృష్టి సారించడం లేదు.
- సీతానగరం మండల కేంద్రంలో సువర్ణముఖి నదిపై రాష్ట్రీయ రహ దారిపై నిర్మిస్తున్న నూతన వంతెన పనులు కూడా అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పిల్లర్ల పనులు దాదాపు పూర్తయ్యాయి. శ్లాబ్ పనులు ప్రారంభించేసరికి బిల్లులు అందకపోవడంతో ఆ పనులకు బ్రేక్ పడింది. దీంతో శిథిలావస్థలో ఉన్న పాత వంతెనపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. 20 టన్నులకు పైబడి బరువున్న వాహనాల రాకపోకలను నిషేధించినప్పటికీ 60 టన్నుల పైబడిన బరువుతో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో పాత వంతెన ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. జిల్లాలోని ఆయా ప్రాజెక్టులు, వంతెనల నిర్మాణాలు, ఇతరత్రా అభివృద్ధి పనులకు నిధులెంతో అవసరం. వాటిని పూర్తిచేయాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపైనే ఉంది. ఈ నేపథ్యంలో నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో వాటికి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

డీఈవోగా ప్రేమ్‌కుమార్

● లింగేశ్వరరెడ్డికి ఆర్జేడీగా గుంటూరు బదిలీ

(విజయనగరం-ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యా శాఖ అధికారిగా ప్రేమ్‌కుమార్ నియామకమయ్యారు. ఈ యన ఇప్పటివరకు పార్వతీపురం డీఈవోగా బాధ్యతలు చూస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న బి.లింగే శ్వర రెడ్డికి ఆర్జే డీగా పదోన్నతి ఇస్తూ గుంటూరుకు బదిలీ చేశారు. ఇందుకు సంబంధించిన ఆదేశాలు మంగళ వారం రాత్రి విడుదలయ్యాయి. అలాగే విజయ నగరం డిప్యూటీ డీఈవోగా పనిచేస్తున్న వాసుదేవ రావుకు కూడా ఉద్యోగో న్నతి లభించింది. ఈయన డీఈవోగా రాజమండ్రికి బదిలీ అయ్యారు.

రూ.27 కోట్లతో ఉపాధి 'లేబర్ బడ్జెట్'

రామభద్రపురం, ఫిబ్రవరి 6: ఈ ఏడాది ఉపాధి హామీ పథకం ద్వారా రూ.27 కోట్లతో లేబర్ బడ్జెట్ రూపొందించినట్టు ఏపీవో జి.త్రినాథరావు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6 లక్షల మందికి మేం డెంట్స్ కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అమృత సరోవర్ ట్యాంక్స్ కింద 5 పనులు, మినీ అమృత సరోవర్ కింద 50 పనులు, హార్టికల్చర్ కింద 200 ఎకరాల్లో అభివృద్ధి పను లు చేస్తున్నామని తెలిపారు. నాలుగు వేల మంది వేతనదారులకు వంద రోజులు పని కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 22 గ్రామ పంచాయతీల్లో పూర్తి స్థాయిలో వేతనదారులకు పనులు కల్పించడానికిచర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నర్సాపురం, రావివలస గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో టెక్నికల్ అసిస్టెంట్‌ల ద్వారా పనులు చేపడుతున్నామని త్రినాథరావు తెలిపారు.

ఇళ్లను తొలగించడం దారుణం

దాసన్నపేట: నగరంలోని బొంకుల దిబ్బ దళితుల ఇళ్లను తొలగించడం అన్యాయమని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తొలగించిన ఇళ్ల వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు ఆర్డరు ఉన్నా అన్యాయంగా ఇళ్లను తొలగించారన్నారు. నివాసం ఉంటున్న వారికి ప్రత్యామ్నాయం చూపకుండా తొలగించడం దుర్మార్గపు చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి మజ్జిగౌరి అమ్మవారి జాతర

రాజాం రూరల్: మండలంలోని అంతకాపల్లిలోని శ్రీ మజ్జిగౌరి అమ్మవారి జాతర మహోత్సవాలు ఈనెల 16 నుంచి 18 వరకు జరగనున్నాయి. జాతర ఉత్సవాల నిర్వహణ కమిటీ సారథ్యంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకూ మూడు రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మూడురోజుల పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాల ముగింపురోజున మధ్యాహ్నం తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఒడిషాలోని రాయఘడ తరువాత అంతకాపల్లిలో మాత్రమే మజ్జిగౌరి అమ్మవారి దేవాల యం ఉండడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి, మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

215 మందికి వైద్య పరీక్షలు

బొబ్బిలి: స్థానిక గౌడవీధి అభ్యుదయ హైస్కూల్లో మంగళవారం అభ్యుదయ ఫౌండేషన్, అభ్యుదయ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆ సంస్థల అధినేతలు ఎంకె నాయుడు, డాక్టర్ చింతా శారద ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, ఈఎన్‌టీ, ఆర్థోపెడిషియన్, గైనకాలజీ, పీడీయాట్రిక్, క్యాన్సర్, జనరల్ సర్జరీకి చెందిన వైద్యులు సుమారు 215 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి

విజయనగరం క్రైం: రోడ్డు భద్రత నిబంధనలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని డీఎస్పీ ఆర్.గోవిందరావు అన్నారు. ఎన్‌జీఓ అధ్యక్షుడు మజ్జి అప్పారావు ఆధ్వర్యంలో సభ్యులు డీఎస్పీని కలిసి రోడ్డు భద్రత నియమాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నుంచి దూరం కావచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ ప్రతినిధులు శ్రీహరిబాబు, ఎ.కృష్ణారావు, కరుణాంకుశం, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

రామభద్రపురం: త్వరలో జరగబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు ఎలా వినియోగించడం అనే దానిపై అవగాహన కల్పిస్తున్నామని తహసీల్దార్ ఆకుల సులోచనారాణి తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌పై మంగళవారం నుంచి వారం రోజుల పాటు ఓటర్లకు అవగాహన కల్పించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కళ్యాణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం కావాలి

జామి, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలో ఉన్న ఎంఆర్‌సీ భవనం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో పాత పెన్షన్ విధానం కావాలని కోరుతూ పోస్టర్లు ఆవిష్కరించారు. పాత పింఛను విధానం అమలు చేసే పార్టీలకే తమ ఓటు అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరరావు, వాసుదేవరావు, శ్రీధర్, దేముడు బాబు, అడివమ్మ, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టిక్కెట్లకు దరఖాస్తులు

శృంగవరపుకోట/జామి, ఫిబ్రవరి 6: అంబదా సుపాలేనికి చెందిన గడి బంగారునాయుడు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టిక్కెట్ తనకు కేటాయించాలని కోరుతూ డీసీసీ అధ్యక్షుడు శరగడ రమేష్ ద్వారా అధిష్ఠానానికి దరఖాస్తు చేశారు. జామి మండలం భీమసింగి గ్రామానికి చెందిన సుంకరి గణేష్ గజపతినగరం నియోజకవర్గం కాంగ్రెస్ టిక్కెట్ కోసం దరఖాస్తు చేశారు.

బీఎల్‌వోలు బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి

రాజాం, ఫిబ్రవరి 6: బీఎల్‌వోలు బాధ్యతగా పనిచేయాలని.. ఎటువంటి ఒత్తిళ్లకు లొంగరాదని రాజాం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్.జోసెఫ్ ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాల్లో మరణించిన వారి పేర్లు ఉంటే తొలగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ఎస్.కృష్ణంరాజు, ఎన్నికల డీటీ ప్రకాష్, పార్టీ నాయకులు గురవాన నారాయణరావు, బండి నర్సింహులు, శ్రీరంగం, మిత్తిరెడ్డి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే సంక్షేమం

● బాబు ష్యూరిటీలో అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 6: పట్టణంలోని వివిధ డివిజన్ల పరిధిలో మంగళవారం అదితి గజపతి రాజు ఆద్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 42, 46 వార్డుల పరిధిలోని దండు మారమ్మ కోవెల, కాళీఘాట్ కాలనీ, తారకరామ కాలనీ, యాత వీధి, గొల్లవీధి, అగురు వీధి, మహంతి వీధి, చాకలవీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. రాష్ట్రాన్ని కాపాడాలంటే టీడీపీని గెలిపించాలని కోరారు.

టీడీపీలో చేరికలు

విజయనగరం రూరల్: టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతి రాజు సమక్షంలో వైసీపీ మద్దతు కుటుంబాలు కొన్ని టీడీపీలో చేరాయి. మంగళవారం 3వ డివిజన్‌కు చెందిన పత్తి సంతోష్, చాటోజు మోహన్, శేఖర్ తదితరులు మత్స్యకార సంఘం నుంచి 1, 4వ వార్డులకు చెందిన ఎ రామకృష్ణ, ఎస్ దుర్గారావు, బి.ఎల్లాజి తదితరులతో సహా ఆయా కుటుంబాలు టీడీపీలో చేరాయి.

ఇళ్ల కూల్చివేత అన్యాయం

విజయనగరం రూరల్: పట్టణంలోని 40వ డివిజన్ పరిధిలోని బొగ్గుల దిబ్బ ఎస్సీ కాలనీలో గత 50 ఏళ్లుగా నివాసం ఉంటున్న దళితుల ఇళ్లను కొంత మంది వైసీపీ నాయకుల ప్రోద్బలంతో తొలగించడం అన్యాయమని ఆరోపిస్తూ 18



టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు, నాయకుల సమక్షంలో మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

కుటుంబాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. వారి వాదనలు విన్న న్యాయస్థానం బుధవారం నాటికి కేసును వాయిదా వేసింది. ఇంతలోనే ఒక రోజు ముందుగా మంగళవారమే గృహాలను తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు తదితర నాయకులు అక్కడికి చేరుకున్నారు. బాధితులను కలిసి ధైర్యం చెప్పారు. మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతూ బుధవారం కోర్టు వాయిదా ఉన్నందున అప్పటి వరకు ఆగాలని కోరారు. అయినప్పటికీ వినిపించుకోని మున్సిపల్ సిబ్బంది కూల్చివేతను కొనసాగించారు. చట్టానికి కూడా వైసీపీ నాయకులు గౌరవం ఇవ్వకుండా దారుణంగా వ్యవహరిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఇళ్లల్లోని సామాన్లు తీసుకునే అవకాశం కూడా ఇవ్వకపోవడం వైసీపీ నాయకుల దౌర్జన్యానికి నిదర్శనమన్నారు.

చంద్రబాబుతోనే బీసీల సంక్షేమం



టీడీపీ నాయకులను అభినందిస్తున్న కొళ్ల

రాజాం, ఫిబ్రవరి 6: చంద్రబాబుతోనే బీసీల సంక్షేమం సాధ్యమవుతుందని రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొళ్ల అప్పలనాయుడు అన్నారు. మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ సూచనల మేరకు సంతకవిటిలో జయహో బీసీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్, స్కూల్ స్టడీ సర్కిల్, స్కిల్ డెవలప్‌మెంట్, విదేశీ విద్యా పథకం తదితర 30కి పైగా బీసీ సంక్షేమ పథకాలను సీఎం జగన్ రద్దు చేశారన్నారు. 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు ఇవ్వకుండా బీసీల సంక్షమానికి తూట్లు పొడిచారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గట్టి భాను, గురవాన నారాయణరావు, నాగళ్ల అప్పలనాయుడు, మొయ్యి నారాయణప్పడు, వల్లూరు గణేష్, బొడ్డేపల్లి సూర్యనారాయణ, ఎడ్ల శ్రీనివాస్, ఎన్ని చిన్నారావు, తమ్మినేని సింహాచలం, వావిలపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

● సెక్టార్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్ల సమావేశంలో ఆర్డీవో

బొబ్బిలి, ఫిబ్రవరి 6: ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దని, ఓటర్ల జాబితాలో మృత ఓటర్లను తొలగింపునకు ఎటువంటి సందిగ్ధత అవసరం లేదని ఆర్డీవో ఎ.సాయిశ్రీ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన ఎన్నికల నిర్వహణాధికా రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మృతుల పేర్లు ఉంటే వాటిని పక్కాగా నిర్ధారించుకుని తొలగించాలన్నారు. ఓటర్ల జాబితాలో పలు తప్పిదాలను ఎత్తిచూపుతూ పత్రికల్లో కథనాలు వస్తున్నాయని, వాటిని సరిచేసుకోవాలన్నారు. సెక్టారు ఆఫీసర్లు, సూపర్ వైజర్లు, బీఎల్‌వోలు అందరూ తహసీల్దారు, ఇతర అధికారులతో సమన్వయంగా ఉండాలని, బీఎల్‌ఓలు తమ పాస్‌వర్డ్‌లను ఇతరులతో ఎట్టిపరిస్థితుల్లో షేర్ చేసుకోరాదని, గోప్యత పాటించాలని లేకుంటే క్రమశిక్షణా చర్యలకు బాధ్యులవుతారన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలన్నిటినీ హేండ్ బుక్‌లో నుంచి అధ్యయనం చేసుకోవాలని ఆమె హితవు పలికారు. ఈ ఎన్నికలను సమిష్టి కృషితో పారదర్శకంగా పనిచేసి విజయవంతం చేయాలని ఆర్డీఓ పిలుపునిచ్చారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్‌లు సాయికృష్ణ, గౌరీశంకర్, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాల తహసీల్దార్లు, ఎన్నికల నిర్వహణాధికారులు, సెక్టారు ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

ఓటర్ల జాబితాలో తప్పులను సరిదిద్దుతాం

లక్కవరపుకోట, ఫిబ్రవరి 6: ఓటర్ల జాబితాల్లో తప్పులను 90 శాతం వరకు సరిదిద్దామని, మరో రెండు రోజుల్లో చిన్న చిన్న తప్పులను కూడా సరిచేసి జాబితాను సిద్ధం చేస్తామని తహసీల్దార్ డీజీఎంఎస్ ప్రసాదరావు తెలిపారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ఓటరు జాబితాల్లోని తప్పులపై కథనం ప్రచురితమైంది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది వీటిని సరిచేసే పనిలో పడ్డారు. గ్రామాల్లో లేనివారికి నోటీసులు జారీ చేశామని, చనిపోయిన వారి ఓట్లను తొలగించామన్నారు. ఎక్కడైనా తప్పులు దొర్లితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఇసుక ట్రాక్టర్ల నుంచి వసూళ్లపై ఆరా

రేగిడి, ఫిబ్రవరి 6: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల నుంచి ప్రైవేటు వ్యక్తులు ఒక సంస్థ పేరుతో వసూళ్లకు పాల్పడటంపై రేగిడి పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ వ్యవహారం వెనక ఎవరు ఉన్నారు? వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తులు ఎవరు అన్న విషయమై దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. ఇసుక ట్రాక్టర్ల నుంచి వసూళ్లపై ఈ నెల 5న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురణ కావడం... మరోవైపు అపరాధ రుసుం కట్టిన ట్రాక్టర్ ఓనర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వటంతో పోలీసులు లోతుగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇదిలాఉండగా మంగళవారం ఇదే టీమ్ గురవాం వద్ద మరికొన్ని ట్రాక్టర్లకు అపరాధ రుసుం విధించేందుకు ప్రయత్నించగా డ్రైవర్లు ఎదురు తిరిగినట్లు సమాచారం. అక్రమ రవాణా కావటంతో బయట పెట్టేందుకు ట్రాక్టర్ డ్రైవర్లు ముందుకు రావడం లేదు. దీనిపై రాజాం సీఐకి సమాచారం ఇచ్చినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల ర్యాలీ



భద్రతావారోత్సవాల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

శృంగవరపుకోట: పట్టణంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ డ్రైవర్లు పాటించాల్సిన నియామాలపై విద్యార్థులు ప్రచారం చేశారు.

'మా సమస్యలు పరిష్కరించండి'

విజయనగరం రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని పట్టణంలోని సైకిల్.. రిక్షా మెకానిక్ వర్కర్ల యూనియన్ నాయకులు, సభ్యులు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజును మంగళవారం కలిశారు. అశోక్ బంగ్లాకు వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలిపారు. అనంతరం వినతి పత్రం అందించారు. తమకు ప్రస్తుతం సరైన ఉపాధి లభించడం లేదని, ప్రభుత్వం కూడా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తి భద్రత లేని తమకు న్యాయం చేయలని కోరారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



పిల్లల సామర్థ్యాలను ప్రశ్నస్తున్న ఎంఈవో

రేగిడి, ఫిబ్రవరి 6: పిల్లలకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఎంఈవో వరప్రసాదరావు ఉపాధ్యాయులకు సూచించారు. పోరాం ప్రాథమిక పాఠశాలను ఎంఈవో మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలో పిల్లల అభ్యసన సామర్థ్యాలు, రివిజన్‌పై హెచ్‌ఎం దూబ రమేష్, సిబ్బందితో సమీక్షించారు. అనంతరం ఖండ్యాం హైస్కూల్‌లో లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంను పర్యవేక్షించారు. ఆయన వెంట ఎంఈఓ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి



సచివాలయ సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

రామభద్రపురం, ఫిబ్రవరి 6: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందు బాటులో ఉంటూ సక్రమంగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ ఆదేశించారు. కొట్టక్కి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. అనంతరం హౌసింగ్ రిజిస్ట్రేషన్లలపై గ్రామ కార్యదర్శి పడాల భాస్కరరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జామి, ఫిబ్రవరి 6: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జామికి చెందిన గొర్లె రామునాయుడు(26) విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల విధులకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందు తూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

రేగిడి: జాడపేటలో 20 మద్యం సీసాలతో మంగళవారం వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి... కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు.

ఎద్దుకు అంత్యక్రియలు

శృంగవరపుకోట రూరల్: మామిడిపల్లిలో మృతి చెందిన ఎద్దుకు శృంగవరపుకోట దాసరి కులవాసులు మంగళవారం సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. వీరు సింహాచలం సింహాద్రి అప్పన్నకు ప్రతిరూపంగా కొలిచే ఎద్దు మామిడిపల్లిలో మృత్యువాత పడింది. ఈ విషయం తెలుసుకున్న శృంగవరపుకోట దాసరి కులస్థులు గ్రామానికి చేరుకొని.. మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ దృశ్యాన్ని చూసేందుకు సమీప గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ

రాజాం: వంగర మండలం రాజులగుమ్మడ గ్రామం వద్ద సోమవారం రాత్రి ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో శివ్వాం గ్రామానికి చెందిన 15 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. వీరు ప్రస్తుతం జీఎంఆర్ కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రులను మంగళవారం నియోజకవర్గ జనసేన సమన్వయ కర్త ఎన్ని రాజు పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్ల పరిస్థితి దారుణంగా ఉండటంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుందన్నారు. ఆయనతో పాటు నాలుగు మండలాల జనసైనికులు ఉన్నారు.

గంజాయి స్వాధీనం

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 6: బొడ్డవర చెక్‌పోస్టు వద్ద మంగళవారం సాయంత్రం కారులో తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. కారు ఆపిన వెంటనే డ్రైవర్ పారిపోయినట్టు సమాచారం. అందులో ఇద్దరు వ్యక్తులు, ఒక మహిళ ఉన్నారని, గంజాయి బ్యాగులు ఉన్నట్టు తెలిసింది. ఈ విషయంపై ఎస్.కోట పోలీసులను వివరణ కోరగా గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలు బుధవారం తెలియజేస్తామన్నారు.

కరాటేలో పతకాలు



పతకాలతో విద్యార్థులు

లక్కవరపుకోట (కొత్తవలస), ఫిబ్రవరి 6: మండలంలో ఒకినావో చాంపియన్ కరాటే డోజో శిబిరం నుంచి ముగ్గురు విద్యార్థులు పతకాలు సాధించినట్టు కోచ్ సూర్యనూకరాజు తెలిపారు. ఏడో అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ 2024 ఆల్ స్టైల్స్ ఇన్విటేషన్ పోటీల్లో పతకాలు వచ్చాయని తెలిపారు. కొత్తవలస నుంచి అయిదుగురు పాల్గొనగా ముగ్గురు మెడల్స్ సాధించారన్నారు. ఎం.గోవర్ధన్ కటా విభాగంలో రజత పతకం, కుమిటే విభాగంలో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. పి.నాగవెంకట వంశీ రెండు రజతాలు, కె.లక్ష్మీదీపక్ కటా విభాగంలో బంగారు, కుమిటీ విభాగంలో వెండి పతకం సాధించినట్లు కోచ్ తెలిపారు.

ఇదేనా అభివృద్ధి?

● విజయనగరంలో అంతా పైపై మెరుగులే

● కానరాని పూర్తి స్థాయి పనులు



గాంధీ పార్కులో ప్రమాదకరంగా జారుడు బల్లలు



ఉల్లి వీధిలో పైపులు వేసేందుకు తవ్విన రోడ్డు..

విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తుండడంతో జిల్లా కేంద్రానికి మెరుగులు దిద్దుతున్నారు. శాశ్వతంగా నిలవాల్సిన పనులను విస్మరిస్తున్నారు. నగర సుందరీకరణ పేరుతో పెద్దచెరువు చుట్టూ హడావిడి చేస్తున్నారు. ఏడాదిన్నర క్రితం వేసిన రోడ్లపై కూడా మళ్లీ తారు పూస్తున్నారు. నగరంలోని అంబటి సత్తర్వు నుంచి కొత్తపేట నీళ్లట్యాంకు వెళ్లే రోడ్డు ఏళ్ల పాటు వదిలేసి తాజాగా శంకుస్థాపన చేశారు. మిగతా రోడ్లను వదిలేశారు. నగరంలో కొన్ని పార్కుల పరిస్థితి అధ్వానంగా మారింది. గాంధీ పార్కులో పిల్లలు ఆడుకునే ఆట వస్తువులన్నీ పోయాయి. నగరంలో కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తున్నా పట్టించుకోవడం లేదు.



పెద్దచెరువు గట్టుపై, గాంధీ విగ్రహం ఏర్పాటు కోసం పనిచేస్తున్న కూలీలు



తోటపాలెం బాలజీనగర్‌లో పందుల గుంపు

జయహో బీసీ సదస్సును విజయవంతం చేయండి

లక్కవరపుకోట: రంగారాయపురం గ్రామం విశాఖ-అరకు హైవే రోడ్డు మార్గంలో మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు తోటలో బుధవారం నిర్వహించనున్న జయహో బీసీ సదస్సును విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షులు చొక్కాల మల్లునాయుడు కోరారు. ఎస్.కోట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో జరగనున్న ఈ సమావేశానికి మండలంలోని టీడీపీ నేతలు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. మాజీ ఎంపీపీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎంవీఐ రవిశంకర ప్రసాద్

విజయనగరం క్రైమ్, ఫిబ్రవరి 6: రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవి శంకర్‌ప్రసాద్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ర్యాలీ నిర్వహించి విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటపుడు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాల నుంచి బయట పడవచ్చుచన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరెంటెండెంట్ డాక్టర్ అనీలా సునందని, డాక్టర్ పీఏ రమణి, డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ సాయికుమార్, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జీవోల జారీలో అలసత్వం వద్దు

మున్సిపల్ కార్మికుల ధర్నా

రాజాం రూరల్, ఫిబ్రవరి 6: మున్సిపల్ కార్మికుల సమ్మె కాలపు ఒప్పందపు జీఓలను జారీ చేయడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని సిటు జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు విమర్శించారు. ఇక్కడి మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం నిర్వహించిన ధర్నాలో ఆయన ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. కార్మికులు సమ్మె విరమించి నెల రోజులు కావస్తున్నా ప్రభుత్వం జీఓలు జారీ చేయలేదని, వెంటనే జీఓలను జారీ చేయడం ద్వారా కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు అనిల్ కుమార్, గురువులు, లక్ష్మి, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఉపాధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం యూత్ ట్రైనింగ్ శిక్షణ కేంద్రంలో మూడు ఉపాధి శిక్షణ కోర్సులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైటీసీ ఇన్‌చార్జి వీవీ రాము తెలిపారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురంలో ఆయనవిలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగ గిరిజన యువతకు రిటైర్డ్ స్టోర్ మేనేజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, నర్సింగ్ కోర్సుల్లో రెండు నెలల పాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను వైటీసీకి ఇవ్వవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు 8978878557 సం ప్రదించాలని కోరారు.

'తప్పు చేస్తే శిక్ష తప్పదు'

పాలకొండ: తప్పుచేస్తే ఏ వయస్సు ఉన్నవారికైనా శిక్ష తప్పదని శ్రీకాకుళం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. మంగళవారం పాలకొండ సబ్‌జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ కేసుల్లో రిమండ్‌లో ఖైదీల వివరాలను జైలు సూపరింటెండెంట్ బి.జోగులును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కోర్టు సిబ్బంది కిరణ్మయి, జైలుహెడ్ వార్డర్స్ పిచం ద్రరావు, విజయ్‌కుమార్, హేమసుందరరావు ఉన్నారు.

టెన్నీకాయిట్‌లో సత్తాచాటిన తలవరం విద్యార్థి

పాలకొండ: మండలంలోని తలవరం ఉన్నత పాఠశాల విద్యార్థి బొడ్డాన రాజు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం జడ్పీ ఉన్నతపాఠశాలలో ఈనెల నాలుగు నుంచి ఆరో తేదీ వరకూ నిర్వహించిన రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ అండర్-17 విభాగంలో సత్తాచాటాడు. బంగారు పతకం సాధించినట్లు హెచ్‌ఎం అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు రాజుకు హెచ్‌ఎంతో పాటు పాఠశాల పీడీ మజ్జి రామకృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్థులు అభినందించారు.

పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు

పాలకొండ:పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తేచర్యలు తప్పవని నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ)వైద్యుడు భాస్కరరావు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు దుకాణాల్లో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెలకు రెండుసార్లు ప్రత్యేక డ్రైవ్ చేపడతామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలఆవరణలో ధూమపానం చేయడం, పొగాకు ఉత్పత్తులు విక్రయించడం నేరమన్నారు. పలు దుకాణాల నుంచి పొగాకు ఉత్పత్తుల సరుకుస్వాధీనం చేసుకుని వెయ్యిచొప్పున జరిమానా విధించారు. తనిఖీల్లో హెల్త్ విజిటర్ జె.రమణమ్మ, నత్తల కళ్యాణ్ ప్రసాద్, పోలీసులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కురుపాం రూరల్: మూలిగూడ జంక్షన్ వద్ద మం గళవారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో దండుసూర గ్రామానికి చెందిన కొండగొర్రి సూర్యానారాయణ (30) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. మూలిగూడ జంక్షన్‌లోని రోడ్డు మలుపు వద్ద ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన స్టాపర్‌ను ద్విచక్రవాహనంపై వస్తున్న సూర్యనారాయణ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సూర్య నారాయణ తన పనులకోసం స్వగ్రామం నుంచి కురు పాం వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ మేరకు ఆయన్ను కురుపాం ఆసుపత్రిలో ప్రథమ చికి త్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురంలోని జిల్లా కేంద్రాసుపత్రికి రిఫర్ చేశారు.

రికార్డుల నిర్వహణలో అలసత్వం వద్దు

గరుగుబిల్లి: సచివాలయాల పరిధిలోని సిబ్బంది రికార్డుల నిర్వహణలో అలసత్వం వహించరాదని ఎంపీడీవో పైల సూర్యనారాయణ అన్నారు. మంగళవారం ఉల్లిభద్ర సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వంసూచించిన మేరకు జాబ్‌చార్ట్‌ను విధిగా నిర్వహించాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా మెరుగైన సేవలందించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. పరిశీలనలో కార్యదర్శి కోటేశ్వరరావు, వీఆర్‌వో ధనుంజయరావు ఉన్నారు.

నగర పంచాయతీ బీజేపీ అధ్యక్షుడిగా చిట్టిబాబు

పాలకొండ: పాలకొండ నగర పంచాయతీ బీజేపీ అధ్యక్షుడిగా కారెపు చిట్టిబాబు నియమితులయ్యారు.ఈ మేరకు బీజేపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి గంట అప్పలనాయుడు పాలకొండలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నిర్వహించిన సమావేశంలో నియమించారు. ఈ సమావేశంలో బీజేపీ మండల, నియోజకవర్గ కన్వీనర్ సవర జమ్మయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టంకాల దుర్గారావు, వీరఘట్టం మండల బీజేపీ అధ్యక్షుడు బురిడిసీతాలక్ష్మి, దుప్పాడ ధనుంజయరావు పాల్గొన్నారు.

పంటలకు రుణ సౌకర్యం పెంపు

పార్వతీపురం రూరల్: పంట రుణ సౌకర్యం పెంచడానికి జిల్లా కన్సల్టేటివ్ కమిటీ (బ్యాంకర్ల సమావేశం) తీర్మానించింది. జిల్లా కన్సల్టేటివ్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో నిశాంత్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగింది.ఈ సందర్భంగా వరి పంటకు రుణ సౌకర్యం గత ఏడాది రూ.38 వేలు నుంచి రూ.42 వేలు ఉండగా వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రూ.42 వేల నుంచి రూ.45 వరకు అందించడానికి నిర్ణయించారు. చెరకు, అరటి, జొన్న, పత్తి పంటలకు కూడా రుణ సౌకర్యం పెంచారు. సమావేశంలో ఆర్‌బీఐ లీడ్ జిల్లా అధికారి పి.నాగ ప్రవీణ, నాబార్డు జిల్లా మేనేజర్ నాగార్జున, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ మూర్తి, డిసిసి జనరల్ మేనేజర్ వాసు, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నిర్మూలనపై అవగాహన

గుమ్మలక్ష్మీపురం: కుష్ఠువ్యాధి నిర్మూలనపై తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపరిధిలో అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సిబ్బంది ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ కుష్ఠువ్యాధిపై ప్రతిఒక్కరూ జా గ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఈ వ్యాధి లక్షణాలపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహి స్తున్నారని తెలిపారు. అనంతరం కరపత్రాలు పంపిణీచేశారు.కార్యక్రమంలో తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్యశాఖ సహాయకులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆశావర్కర్లు, సిబ్బంది

స్వాగతికకు అభినందన

రాయగడ: రాయగడ మహిళాకళాశాల విద్యార్థిని స్వాగతికను ప్రిన్సిపాల్ అర్చనాపట్నాయక్ అధ్యక్షతన అభినందించారు. గత నెల 26న ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల పెరేడ్‌లో స్వాగతి పాల్గొంది. కార్యక్రమంలో ఒడిశాఎన్‌సీసీ సుబేదార్ వినోద్, ఎన్‌సీసీ అధికారి రీతారాణి పాల్గొన్నారు.



స్వాగతికను అభినందిస్తున్న అధ్యాపకులు

417.460 కిలోల గంజాయి స్వాధీనం

ఒడిశా

రాయగడ: వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 417.460 కిలోల గంజా యిని గుడారి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గుడారి ఎస్‌ఐ సోమనాథ్ దొళోబెహరా కథనం మేరకు...వ్యాన్‌లో గంజాయి తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు దాడిచేసి నిందితులను పట్టుకున్నారు. 12 ప్లాస్టిక్ బస్తాల్లో తరలిస్తున్న 417.460 కిలోల గంజాయితోపాటు రెండు సెల్‌ఫోన్లు, రూ.200 స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు నిందితులు అజిత్‌రైతా, సంజయ్‌రైతాలను కోర్టుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్ట్రాంగ్ రూములపై సమీక్ష

రాయగడ:గుణుపురంలో రానున్న సార్వత్రిక ఎన్నికల సన్నాహాల్లో భాగంగా స్ట్రాంగ్ రూము, వాహనాల పార్కింగ్, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది బస, బూత్‌లకు వెళ్లాల్సిన రూట్ తదితర విషయాలపై కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ మంగళవారం సమీక్షించారు.గుణుపురం సబ్ కలెక్టర్ కిరణదీప్ కౌర్ కలెక్టర్‌కు వివరించారు.అనంతరం గుణుపురం కళాశాలలో ఫైవ్ టి(5.టి) కార్యక్రమం, గుణుపురం కొండపై నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపం, శివాలయ సుందరీకరణ తదితర పనులను పరిశీలించారు. కార్యక్రమంలో గుణుపురం తహసీల్దారు లీలావతి ఆచార్య, అసిస్టెంట్ కలెక్టర్ సత్యజిత్ నాయక్ పాల్గొన్నారు.



కురుపాం రూరల్: మాట్లాడుతున్న విజయరామరాజు



మక్కువ: మాట్లాడుతున్న సంధ్యారాణి

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● తెలుగుదేశం పార్టీ నాయకులు

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు తెలిపారు. మంగళవారం కురుపాం మండలంలోని కిచ్చాడ పంచాయతీలో బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం, మక్కువలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నియంత పాలనకు సాగనంపాలి: శత్రుచర్ల

కురుపాం రూరల్: వైసీపీ నియంత పాలనను సాగనంపి చంద్రబాబును ముఖ్యమంత్రిగాచేయాలని మాజీమంత్రి శత్రుచర్ల విజయరామరాజు పిలుపునిచ్చారు. మండలంలోని కిచ్చాడ పంచాయతీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని ఆరు హామీలతో రాష్ట్ర ప్రజల భవిష్యత్‌కు గ్యారెంటీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్, నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి, టీడీపీ మండల కన్వీనర్ కొండయ్య పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం: సంధ్యారాణి

మక్కువ: టీడీపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ సాలూరునియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. మక్కువలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ భూస్థాపితం కావడం ఖాయమన్నారు. సాలూరు నియోజకవర్గ అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర చేసింది ఏదీ లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి గౌరీశంకర్, సాలూరు, మెంటాడ మండలాధ్యక్షుడు నిమ్మాది తిరుపతి, చలుమూరి వెంకట్రావు, మావుడి ప్రసాదరావు పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ

సీతానగరం:మండలంలోని గాదెలవలసలో బుధవారం బాబుష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు కొల్లి తిరుపతిరావు, ప్రధానకార్యదర్శి వేణుగోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు.కార్యక్రమంలో పార్వతీపురం, బొబ్బిలి నియోజకవర్గాల ఇన్‌చార్జులు బోనెల విజయచంద్ర, బేబీనాయన పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యకర్తలు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు జయప్రదం చేయాలని కోరారు.

సురక్షితమైన తాగునీరందించండి

● సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే, అధికారులు విఫలం ● పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర

బెలగాం:పట్టణవాసులకు శుద్ధిచేసిన, సురక్షితమైన తాగునీరు ప్రతి రోజూ కుళాయిలు ద్వారా అందించాలని పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర డిమాండ్‌చేశారు. మంగళవారం స్థానిక మునిసిపల్ కార్యాలయం ఎదుట పట్టణవాసులతో కలిసి నిరసన తెలిపి కమిషనర్ సింహాచలానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయచంద్ర మాట్లాడుతూ వైసీపీపాలనలో మునిసిపాలిటీలో సమస్యలు పేరుకుపోయాయని ఆరోపించారు.తాగునీటి, డంపింగ్ యార్డు సమస్యలు పరిష్కరించడంలో స్థానికఎమ్మెల్యే, అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. పట్టణం మురికికూపంగా తయారయ్యిందని విమర్శించారు కుళాయిల ద్వారా వచ్చే నీరు బురద మయంగా ఉందని, పాత్రలు కడగడానికి కూడా వినియోగించడానికి వీలుగాలేదని తెలిపారు. ప్రతి రోజూ తాగునీరు అందించాలని కోరా రు. పట్టణంలో పారిశుధ్యనిర్వహణ అధ్వానంగాఉందని, కొన్నివార్డుల్లో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో దోమలు విజృంభిస్తున్నాయని, దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు మురుగు నీరు తొలగించ డానికి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన కమిషనర్ రామప్పలనాయుడు వెళ్లేముందు మున్సిపాలిటీలో ఉద్యోగాలువేసి వసూళ్లకు పాల్పడ్డారని, ఆయన అవినీతిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వైసీపీ పాలనలో అభివృద్ధిపేరును ప్రజలు మరచిపోయా రని, టీడీపీ అధికారంలోకివచ్చిన తర్వాత పార్వ తీపురంలోని సమస్యలు పరిష్కారానికి ప్రాధాన్యతఇస్తామని తెలిపారు. కార్యక్రమంలోటీడీపీనాయకులు బార్నాల సీతారాం, వెంకటనాయుడు, మజ్జి వెంకటేష్, టీడీపీ కౌన్సిలర్లు నారాయణరావు, గౌరునాయుడు పాల్గొన్నారు.



పట్టణవాసులతో కలిసి నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

ఒప్పంద జీవోలు విడుదల చేయాలి

● మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

బెలగాం: ఒప్పంద పత్రాల జీవోలు విడుదల చేయాలని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మునిసిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టిన సమయం లో ప్రభుత్వం చర్చలు జరిపి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. మేరకు మంగళవారం ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడుకు వినతిపత్రం అందజేశారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్ .శంకరరావు మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గొర్లి వెంకటరమణ, యూనియన్ నాయకులు సీహెచ్ సింహాచలం, మల్లేష్, ఎం.శివ, నిర్మల పాల్గొన్నారు.



ఇన్‌చార్జి డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం కల్పించాలి

● జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్



కళాజాతాలో మాట్లాడుతున్న గొంటి గిరిధర్

పాలకొండ: ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని కల్పించి సమాజాభివృద్ధికి కృషి చేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ పిలుపునిచ్చారు. మంగళవారం పాలకొండలో జనవిజ్ఞానవేదిక పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు కొండపల్లి గౌరునాయుడు అధ్యక్షతన శాస్త్రీయదృక్పథకాంపైన్‌లో భాగంగా రాష్ట్రస్థాయి సైన్స్‌కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పారినా యుడు సైన్స్‌కళాజాతా ద్వారా జేవీవీ ప్రజానీకాన్ని చైతన్యవంతం చేయడాన్ని అభినందించారు. జిల్లా గౌరవాధ్యక్షుడు బీవీరమణ శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేం దుకు జేవీవీ కృషిని కొనియాడారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సార్తి మహేశ్వరరావు మాట్లాడుతూ మూఢ నమమకాలను సమాజం నుంచి దూరం చేయాలని పిలుపునిచ్చారు. తొలుతప్రదర్శించిన సైన్స్ నృత్య రూపకాలు, సైన్స్ నాటికలు,సైన్స్ గీతాలాపనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బీఎం గౌరీశ్వరరావు, నాయకులు రామారావు, చిన్నారావు, ఫకీరు స్వామి, పుష్పనాధం, రామకృష్ణ, రాజకుమారి పాల్గొన్నారు.

'ఓట్ ఫర్ ఓపీఎస్'ను జయప్రదం చేయండి

సీతానగరం: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ సాధనకు చేపట్టిన ఓట్ ఫర్ ఓపీఎస్ కార్యక్రమం జయప్రదం చేయాలని యూటీఎఫ్ నాయకు లు కోరారు. మంగళవారం సీతానగరంలో యూటీఎఫ్ నాయకులు ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈసందర్భంగా యూటీఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పల్లి శ్రీనివాసరావు, బొత్స ప్రసాదరావు మాట్లాడుతూ పాత పెన్షన్ పథకం సాధనకు ఈనెల 12 వరకు పోస్టుకార్డు ఉద్యమంతోపాటు అన్ని రాజకీయ పార్టీల రాష్ట్ర అధ్యక్షులకు లేఖలు రాస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం. గోవిందరావు, మండల కౌన్సిల్‌సభ్యులుఆదినారాయణ, రమేష్, ఉపాధ్యాయులు కృష్ణ, గౌరమ్మ పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుని సేవలందించండి

గరుగుబిల్లి:గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాల్లో ప్రజల అనారోగ్య సమస్యలు తెలుసుకుని వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో బి.జగన్నాధరావు సూచించారు.గొట్టివలసలో వైద్యశిబిరాన్నిఆకస్మికంగా సందర్శించారు. వైద్యశిబిరాల ప్రాంతాల్లో ల్యాబ్‌లను ఏర్పాటుచేసి రక్త పరీక్షలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు, ఈవోపీఆర్‌డీ పాల్గొన్నారు.



గొట్టివలసలో రోగుల సమస్యను తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

డీవార్మింగ్ డే విజయవంతం చేయాలి

జియ్యమ్మవలస: నులిపురుగుల నివారణ దినత్సవం (డీవార్మింగ్ డే)ను పురస్కరించుకుని ఈనెల తొమ్మిదో తేదీన జరగనున్న మాత్రల పంపిణీ కార్యక్రమానికి ప్రతిఒక్కరూ సహకరించి విజయవంతం చేయాలని జియ్యమ్మవలస పీహెచ్‌సీ వైద్యాధికారి జగదీష్, ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎపిడమిక్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ కోరారు. మంగళవారం జియ్యమ్మవలస పీహెచ్‌సీలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు.

గిరిజనుల ఆర్థికాభివృద్ధే ధ్యేయం: ఎండీ

మక్కువ : గిరిజనుల ఆర్థికాభివృద్ధే జీసీసీ ధ్యేయమని ఆ సంస్థ ఎండీ సురేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని మార్కొండపుట్టిలో పసుపు ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులు తమ పంట ఉత్తత్తులను వనధన్ వికాస్ కేంద్రాల్లో విక్రయించి ఆర్థికంగా లాభపడాలన్నారు. దళారుల ప్రమేయాన్ని నివారించేందుకే వనధన్ వికస కేంద్రాల్లో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటులతో మహిళా సంఘాలు బలోపేతం అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం బలగ సన్నిబాబు, సీసీలు, వీడీవీకె సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్‌కుమార్

నియంతల పాలన నుంచి రక్షించుకోవాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య

బెలగాం: నియంత పాలన నుంచి దేశం, రాష్ట్రాన్ని రక్షించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి సిద్ధం అంటూ సభలు నిర్వహిస్తున్నారని, అసలు దేనికి సిద్ధమని ప్రశ్నిం చారు. ల్యాండ్, శాండ్, మైన్, వైన్ నొక్కేయడానికా.., దళిత, గిరిజన హక్కులు కాలరాయడానికి సిద్ధమా అని అన్నారు. డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను నట్టేట ముంచడానికి సిద్ధమా, రైతులను ఆదుకోకుండా ముంచేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. నరేంద్ర మోడీ నియంతపాలనకు వచ్చే ఎన్నికల్లో చరమగీతం పాడాలన్నారు.



మాట్లాడుతున్న ఈశ్వరయ్య

యువతి అదృశ్యంపై కేసు నమోదు

జియ్యమ్మవలస:తన కుమార్తె మర్రాపు శ్రీలత (19) అదృశ్యమైనట్లు ఆమె తండ్రి గౌరునాయుడు మంగళవారం చినమేరంగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులకథనం మేరకు.. మండలంలో చింతలబెలగాం గ్రామానికి చెందిన మర్రాపుగౌరునాయుడుకు కుమారుడు కృష్ణంనాయుడు, శ్రీలత ఉన్నారు. కుమార్తె శ్రీలత పార్వతీపురంలోని ఓ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ రెండో సంవత్సరం చదువుతోంది. ఈనెల ఒకటో తేదీన ఉదయం కళాశాలలో పరీక్షలు రాయడానికి అని వెళ్లి తిరిగి రాలేదు.దీంతో కుటుంబసభ్యులు,బంధువులు, స్నేహితుల ఇళ్లకు ఫోన్‌చేసి వెతికినా దొరకలేదు. ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ డి.చిన్నంనాయుడు కేసు నమోదు చేశారు.

12.5 కిలోల గంజాయి స్వాధీనం

పాచిపెంట: అక్రమంగా తరలిస్తున్న 12.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సాలూరు రూరల్ సీఐ బాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఒడిశాలోని రాళ్లగెడ్డకు చెందిన రామదుర్గాను అరెస్టు చేశామని చెప్పారు. సీఐ కథనం మేరకు.. ముందస్తు సమాచారం ప్రకారం మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై గంజాయి అక్రమ రవాణా చేస్తుండగా పట్టుబడ్డాడు. గంజాయిని, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. తనిఖీల్లో స్థానిక ఎస్‌ఐ పి.నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భర్త చెంతకు వివాహిత

జియ్యమ్మవలస: బిత్రపాడు గ్రామానికి చెందిన కొప్పర నీలిమను ఆమె భర్త దాలిగురువులుకు మంగళవారం ఆమె తల్లి సునీత సమక్షంలో అప్పగించారు. ఈనెల ఒకటోతేదీన తనభార్య కనిపించడంలేదని నీలిమ భర్త దాలిగురువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చినమేరంగి స్టేషన్‌లో కేసు నమోదుచేశారు. ఎస్‌ఐ చిన్నంనాయుడు ఆదేశాల మేరకు ఏఎస్‌ఐ పత్రిక కాసులు, పోలీసులు గాలించి ఆమె ఆచూకీ తెలుసుకొని స్టేషన్‌కు తీసుకువచ్చారు. భర్త దాలిగురువులు, భార్య నీలిమకు కౌన్సెలింగ్ నిర్వహించి వారిద్దరిని ఇంటికి పంపించారు.

10 నుంచి రాజశ్యామల యాగం

బెలగాం:పార్వతీపురంలోని శ్రీవిద్యాసర్వమంగళాదేవి పీఠం ప్రాంగణంలో రాజశ్యా మలాదేవి యాగానికి మంగళవారం భూమి, గోపూజ నిర్వహించినట్లు ఆ ఆలయచైర్మన్, నాడీ జ్యోతిష్యులు మురపాక కాళిదాసు యాజి తెలిపా రు. ఈనెల పది నుంచి 64 రోజులు ఈ యాగం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

హైరిస్క్ గర్భిణులను పర్యవేక్షించండి: డీఎంవో

సీతానగరం: హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని జిల్లా మలేరియా అధికారి (డీఎంవో) టి.జగన్‌మోహన్‌రావు కోరారు. మంగళవారం బలిజిపేట మండలంలోని గలావిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ పరీక్షల రికార్డులు తనిఖీ చేసి వ్యాధి నిర్ధారణ పరీక్షలు, నివేదికల వివరాలు, మందులు, వ్యాక్సిన్ నిల్వలు వాటి నిర్వహణ రికార్డులు పరిశీలించారు. మైక్రోస్కోప్, ల్యాబ్ పరికరాల పనితీరును గమనించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ప్రసూతి గదిలో డెలివరీకి అవసరమైన సదుపాయాలు ఏ మేరకు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశాడే సమావేశంలో ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఈనెల తొమ్మిదో తేదీన నిర్వహించనున్న డీ వార్మింగ్‌డే కార్యక్రయిపొరొ కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. గర్భిణీల రిజిస్ట్రేషన్ త్వరగా జరగాలని కోరారు. ఆరోగ్య కేంద్రాల్లో క్షేత్ర స్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలఅందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంవో సూర్యనారాయణ, వైద్యాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



గలాపల్లి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జగన్‌మోహన్‌రావు

ఆశావర్కర్ల పదవీ విరమణ వయస్సు పెంచాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు డిమాండ్

సాలూరు రూరల్: ఆశావర్కర్ల పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం సాలూరు మండలంలోని మామిడిపల్లి, తోణాం, బాగు వలస పీహెచ్‌సీల వైద్యాధికా రులకు ఆశావర్కర్లు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాజేశ్వరి, రమణమ్మ, భారతి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● **సీతానగరం:** తమ సమస్యలను పరిష్కరించాలని వైద్యాధికారి పావనికి ఆశా కార్యకర్తలు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సీఐటీయూ మండల కార్యదర్శి గౌర్ వెంకటరమణ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.



మామిడిపల్లిలో నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు